ప్రజాశక్తి




లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులను డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్. భాస్కరరావు హెచ్చరించారు. గర్భస్థ పిండ ప్రక్రియ చట్టం 1994 అమలుపై నియమించిన జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జరిగింది. గర్భస్థ పిండ పరిస్థితి, వ్యాధుల గుర్తింపు తదితర పరీక్షలకు వినియోగించాల్సిన యంత్రాలను లింగ నిర్ధారణకు ఉపయోగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. సరోగసి రేగులేషన్ చట్టం - 2021 ప్రకారం జిల్లాలోని ఫెర్టిలిటీ కేంద్రాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమం లో వ్యాధి నిరోధక టీకా అధికారి డాక్టర్ అచ్యుత కుమారి, డిప్యూటీ డిఎంహెచ్ఒ ఎస్. సూర్యనారాయణ, డాక్టర్ ఉమా మహేశ్వరి, స్త్రీ వైద్య నిపుణులు ఆర్. సుజాతదేవి, తదితరులు పాల్గొన్నారు.

సాహితీ ప్రపంచంలో తొలి అడుగు(ర)జాడ

ఆధునిక కథకు శ్రీకారం చుట్టిన ఆద్యుడు. కథ, కథానికలో ఆయన దిట్ట.. నవయుగ వైతాళికుడు.. తన రచనలతో మెరుగైన ప్రపంచానికి అడుగులు వేసిన అభ్యుదయ వాది.. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారుల్లో ముఖ్యుడు.. ఆయనే గురజాడ వెంకట అప్పారావు. వాసికెక్కిన రచనలతో గురజాడ అప్పారావు వ్యవహార భాషలో ప్రజలందరికీ చేరువయ్యాడు.. అందుకే నవయువ వైతాళికునిగా పేరు గాంచాడు. నేడు గురజాడ అప్పారావు 162వ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం..



నేడు 162వ జయంతి ● అమలు కాని పాలకుల హామీలు

ప్రజాశక్తి - విజయనగరంకోట

విశాఖపట్నం జిల్లా యలమంచిలిలోని సర్వసిద్ధి గ్రామంలో 1862 సెప్టెంబరు 21న వెంకటరామదాసు, కౌసల్యమ్మ దంపతులకు గురజాడ వెంకట అప్పారావు జన్మించారు. ఆయన కుటుంబం తాతల కాలంలో కృష్ణా జిల్లా గురజాడ నుంచి విశాఖ వలస వచ్చింది. అప్పారావు తండ్రి విజయనగరం సంస్థానంలో పేష్కారుగా, రెవెన్యూ సూపర్‌వైజరుగా పనిచేశారు. ఆ సమయంలోనే అప్పారావు చీపురుపల్లిలో చదువుకున్నారు. తర్వాత, తండ్రి మరణించడంతో విజయనగరానికి వచ్చారు. ఇక్కడ చాలా పేదరికంలో ఉంటూ వారాలు చేసుకుంటూ చదువు కొన సాగించారు. ఈ సమయంలో అప్పటి ఎంఆర్ కాలేజ్ ప్రిన్సిపల్ సి.చంద్రశేఖరశాస్త్రి ఆయనను చేరదీసి ఉండడానికి చోటిచ్చారు. 1882లో మెట్రిక్యులేషన్ పూర్తిచేసి, తర్వాత 1884లో ఎఫ్ఎ చదివారు. అదే సంవత్సరం ఎంఆర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా చేరారు. విజయనగరంలో బిఎ చదువుతున్నప్పుడు వాడుక భాషోద్యమకారుడు గిడుగు రామ్మూర్తి ఆయనకు సహాధ్యాయి.



గురజాడ నివాసం

1885లో అప్పారావుకు అప్పలనరసమ్మతో వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం. గిడుగు రామ్మూర్తితో కలిసి అప్పారావు వాడుక భాషా వ్యాప్తికి ఉద్యమించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కన్యాశుల్కం నాటకాన్ని 1890 ప్రాంతంలో పూర్తి వాడుకభాషలో రచించారు. ఆ రోజుల్లో ప్రబలంగా ఉన్న కన్యాశుల్కం, వేశ్యవృత్తి వంటి దురాచారాలపై ఇందులో ఆయన దుమ్మెత్తారు. 1892లో కన్యాశుల్కం నాటకాన్ని తొలిసారి ప్రదర్శించారు. 1897లో దాని వావిళ్ల రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ సంస్థ ప్రచురించింది. ఆ తొలికూర్పుని మహారాజా ఆనందగజపతిరాజుకు గురజాడ అంకితమిచ్చారు. ప్రస్తుతం లభిస్తున్న కన్యాశుల్కం రెండో కూర్పును 1909లో రచించారు. 1910లో ఆయన రాసిన 'దేశమును ప్రేమించుమన్నా' దేశభక్తి గీతం ఎంతో పేరు పొందింది. ఆయన కలం నుంచి వెలువడిన పుత్తడి బొమ్మ పూర్ణమ్మ అనే గేయం సుప్రసిద్ధమైంది.

వ్యవహారిక భాషోద్యమం

20వ శతాబ్దం తొలినాళ్లలో జరిగిన వ్యవహారిక భాషో ద్యమంలో గురజాడ అప్పారావు తన సహాధ్యాయి గిడుగు రామ్మూర్తితో కలిసి పోరాడారు. ఇద్దరూ కలిసి పత్రికల్లో, సభల్లో, మద్రాసు విశ్వ విద్యాలయంలో గ్రాంథిక భాషా వాదులతో తలపడ్డారు. గిడుగు వాదనా బలానికి, గురజాడ రచనా శక్తి వ్యవహారిక భాషోద్యమానికి ఉపయోగపడ్డాయి. 1913లో అప్పారావు ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి అనారోగ్యంతో బాధపడేవారు. నవయుగ వైతాళికుడిగా పేరుగాంచిన గురజాడ 1915 నవంబర్ 30న భౌతికంగా దూరమయ్యారు.

పాలకుల వట్టిమాటలు.. అమలుకాని హామీలు

గురజాడ జయంతిని ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహిస్తున్నారు. గురజాడ 150వ జయంతి సందర్భంగా గురజాడ నివాసాన్ని మ్యూజియంగా మారుస్తామని, గురజాడ నివాసం పక్కనే స్థలంలో ఆడిటోరియం నిర్మిస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఓపెన్ ఆడిటోరియం నిర్మిస్తామని చెప్పి శిలాఫలకం కూడా ఏర్పాటు చేశారు. కానీ ఇవేవీ ప్రభుత్వాలు మారినా అమలు కాలేదు. పురావస్తు శాఖ 2015 మే 15న ఈ ఇంటిని అధీనంలోకి తీసుకుంది. పురావస్తు శాఖ దగ్గర సరిపడా నిధులు లేకపోవడంతో 2023 నవంబర్ నుంచి ఈ గృహ నిర్వహణకు ప్రతినెలా జిల్లా పరిషత్ నుంచి పదివేల రూపాయలు పుస్తకాల ద్వారా అందజేస్తున్నారు. గత పదేళ్లలో ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు వట్టి మాటలుగానే మిగిలిపోయాయని ప్రజలు, కవులు కళాకారులు, సాహితీవేత్తలు వాపోతున్నారు.

సమాజాన్ని చైతన్యపరిచిన గురజాడ భవనాన్ని కాపాడుకోవాల్సిన గురు తర బాధ్యత మన అందరిపైనా ఉంది. గురజాడకు సంబంధించిన రచనలు జ్ఞాపకాలు భవితరాలకు అందించాలని ప్రజలంతా కోరుకుంటున్నారు. గురజాడ దేశభక్తి గేయం సర్కారీకరణ సర్వసమ్మతం అయినందున ప్రతి పాఠశాలలో ప్రార్థన గీతంగా పాడించాలని కవులు, సాహితీవేత్తలు, కళాకారులు, అభిమానులు ప్రజలు కోరుకుంటున్నారు. ఆయన గొప్పతనాన్ని నేటి తరానికి కూడా తెలియజేయాలని ఆశిస్తున్నారు. గురుజాడ కళాక్షేత్రంగా పిలుచుకుంటున్న దాన్ని ఇంకా పెద్దదిగా అభివృద్ధి చేసేందుకు రెండు కోట్ల రూపాయలు కేటాయిస్తామని ఇచ్చిన మాటను కూడా గట్టుమీద పెట్టారే తప్ప అమలు చేయలేదు. జిల్లాలో జెఎన్‌టియు విశ్వవిద్యాలయానికి గురజాడ విశ్వవిద్యాలయంగా పేరు పెట్టి చేతులు దులుపుకున్నారు. ఇప్పటికైనా గురజాడ మ్యూజియం, ఆడిటోరియం పనులు చేపట్టి ఆయన స్ఫూర్తిని భావితరాలకు అందించాలని కవులు, కళాకారులు, సాహితీప్రియులు కోరుతున్నారు.

నేడు గురజాడ జయంతికి ఏర్పాట్లు

రాష్ట్ర ప్రభుత్వం గురజాడ వారి జయంతిని రాష్ట్ర ఉత్సవంగా ప్రకటించిన నేపథ్యంలో ప్రభుత్వ కార్యక్రమంగా నగరంలో నిర్వహించేందుకు కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఆదేశాల మేరకు యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. గురజాడ స్వగృహాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. శనివారం ఉదయం 9 గంటలకు గురజాడ స్వగృహంలో ఆయన చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలనతో జయంతి కార్యక్రమాలు మొదలవుతాయి. అనంతరం గురజాడ కూడలి వద్ద వారి విగ్రహానికి నివాళు లర్పించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో జయంతి ఉత్సవ సభా కార్యక్రమాలు నిర్వహిస్తారు. గురజాడ వారి రచనలపై పలు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనతో పాటు ప్రముఖుల సందేశాలు, గురజాడ రచనలపై అధ్యయనం చేసిన రచయితలు, కన్యాశుల్కం నాటకాన్ని ప్రదర్శించిన పలువురు కళాకారులను సత్కరించనున్నారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు, మేయర్ వి.విజయలక్ష్మి తదితరులు హాజరు కానున్నారు.

పైడితల్లమ్మ జాతరకు శ్రీకారం

ఘనంగా పందిరిరాట

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పైడితల్లి అమ్మవారి పండగకు తొలి అడుగు పడింది. అమ్మవారి జాతరలో ప్రారంభ ఘట్టంగా భావించే పందిరి రాట కార్యక్రమం శుక్రవారం అమ్మవారి ఆలయం వద్ద ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు పాల్గొని రాటను ప్రతిష్టించారు. తరువాత పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం గుడి ఆవరణలో ఏర్పాటు చేసిన కోలాటాన్ని తిలకించి, వారితో పాటు కోలాటం ఆడి ఉత్సాహాన్ని నింపారు. ఈ సందర్భగా ఆమె మాట్లాడుతూ ఈ పందిరి రాటతో అమ్మవారి పండగ మొదలవు తుందని తెలిపారు. 2019లో ఈ పండగను రాష్ట్ర పండగగా నాటి ప్రభుత్వం గుర్తించిందన్నారు. అక్టోబర్ 14న తొలేళ్ల ఉత్సవం, 15న సిరిమాను జాతర జరుగుతుందని తెలిపారు. అమ్మవారి దర్శనం చేసుకోవడానికి ఉత్తరాంధ్ర నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని, ఆలయ చైర్మన్ పూసపాటి అశోక్ గజపతి రాజు ఆదేశాలకు అనుగుణంగా భక్తులందరికీ ఉచిత దర్శనం అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, పూజారి బంటుపల్లి వెంకటరావు, ఆలయ సిబ్బంది, టిడిపి నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



పందిరిరాట వేస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, పూజారి, ఆలయ అధికారులు

ఇది మంచి ప్రభుత్వం ఎందుకంటే..

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ● కెంగువలో ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-గజపతినగరం

'ఇది మంచి ప్రభుత్వం ఎందుకంటే... అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎన్నో కార్యక్రమాలను అమలు చేసి ప్రజల సంక్షేమానికి పాటుపడింది. సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని సంక్షేమబాట పట్టించింది. రైతులకు ధాన్యం బకాయిలు రూ.1600 కోట్లను చెల్లించింది. ఆరోగ్యశ్రీ పథకానికి గత ప్రభుత్వం రూ.1600 కోట్లు బకాయిలు పెట్టగా, రూ.700 కోట్లను విడుదల చేసి సేవలను పునరుద్దరించింది. పింఛన్లను ఒకే విడతలో భారీగా పెంచింది. ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేసి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించింది. అందుకే ఇది మంచి ప్రభుత్వమని రాష్ట్ర ఎంఎస్ఎంఇ శాఖామంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. కెంగువ గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శుక్రవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. గోడలకు స్టిక్కర్లను అంటించారు. ఈ వంద రోజుల్లో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అంగన్వాడీ కేంద్రాన్ని, పాఠశాల భవనాన్ని, ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

కెంగువ గ్రామానికి వరాలు

కెంగువ గ్రామానికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వరాలు కురిపించారు. గ్రామంలోని సమస్యలన్నిటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామసభ నిర్వహించి సమస్యలను తెలుసుకున్నారు. అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సుమారు రూ.80 లక్షలతో నూతన పాఠశాల భవన నిర్మాణాన్ని ఏడాదిలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. శ్మశానానికి రహదారి సౌకర్యం కల్పిస్తామని, కాలువలను నిర్మిస్తామని చెప్పారు. ఏడాదిలో ఇంటింటికీ కొళాయిలు ఏర్పాటు చేసి, తాగునీటి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. ప్రభుత్వ అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేసి ముందుకు నడిపిస్తామని, ప్రజలకు ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రమేష్, ఎంపిడిఒ కిషోర్‌కుమార్, తహశీల్దార్ రత్నకుమార్, ఎంఇఒ విమల, మాజీ ఎంపిపి గంట్యాడ శ్రీదేవి, మాజీ జెడ్‌పిటిసి మక్కువ శ్రీధర్, కూటమి పార్టీల నాయకులు గోపాలరాజు, రెడ్డి పావని, మర్రాపు సురేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమమా? పార్టీ కార్యక్రమమా?

కెంగువ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం.. అధికారిక కార్యక్రమం. అయితే ఈ కార్యక్రమంలో అధికారులకు గాని, ప్రజాప్రతినిధులకు గాని ప్రోటోకాల్ ప్రకారం స్టేజిపై చోటులేకపోవడం గమనార్హం. వారికి చైర్లు కనీసం కేటాయించలేదు. నామమాత్రానికి ఎంపిడిఒ వంటి ఒకరిద్దరు అధికారులు మాత్రమే స్టేజికి ఒక మూలన కూర్చున్నారు. ఎటువంటి పదవులూ లేని టిడిపి, బిజెపి, జనసేన నాయకులు స్టేజి పంచుకోవడంపై ఆ గ్రామస్తులు ముక్కున వేలేసుకున్నారు. ఇది పార్టీ కార్యక్రమమా, ప్రభుత్వ కార్యక్రమమా? అంటూ చర్చించుకున్నారు.

రౌడీషీటర్ల ప్రవర్తనపై నిఘా

● నేరాలపై గ్రామసభల ద్వారా అవగాహన

● ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరం కోట

రౌడీషీటర్ల ప్రవర్తన, నేర చరిత్ర ఆధారంగా విభజన చేసి వారిపై నిఘా పెట్టాలని ఎస్‌పి వకుల్ జిందాల్ పోలీసు అధికారులకు సూచించారు. దర్యాప్తులో ఉన్న గంజాయి, మిస్సింగు, పోక్సో, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులపై శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ విధి నిర్వహణలో భాగంగా ప్రతీ ఒక్కరూ నీట్ యూనిఫారం ధరించడంతోపాటు, లాఠీని తప్పనిసరిగా తమ వెంట తీసుకొని వెళ్ళాలన్నారు. పోలీసు స్టేషనుకు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలని, వారి ఫిర్యాదుల పట్ల సానుకూలంగా స్పందించాలని ఆదేశించారు. డయల్ 100 ఫిర్యాదులపై సకాలంలో స్పందించి, సాధ్యమైనంత వేగంగా సంఘటనా స్థలంకు చేరుకొని, సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. రాత్రి గస్తీని మరింత ముమ్మరం చేయాలని, ప్రతీ బీటును పర్యవేక్షణ అధికారులు కనీసం మూడుసార్లు తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఎటిఎం కేంద్రాల్లో నేరాలు జరగకుండా, నిఘా పెట్టాలన్నారు. రాత్రి పెట్రోలింగు నిర్వహించే సిబ్బంది ఆకస్మికంగా వాహన తనిఖీలు చేయాలని, లాడ్జిలు, రైల్వే స్టేషనులు, బస్టాండులు, ముఖ్య కూడళ్ళలో తనిఖీలు నిర్వహించి, అనుమానస్పద వ్యక్తుల గురించి ఆరా తీయాలని తెలిపారు. వారి వేలి ముద్రలను మొబైల్ వేలిముద్రల డివైజ్ తో తనిఖీ చేసి, వారికి నేర చరిత్ర ఉన్నది? లేనిది? తెలుసుకోవాలన్నారు. రాత్రి 11 గంటల తరువాత సహేతుకరమైన కారణం లేకుండా బయట తిరగకుండా చూడాలని తెలిపారు.

రౌడీ షీట్లు కలిగిన వ్యక్తులను వారి ప్రవర్తన, చెడు నడతను బట్టి మూడు క్యాటగిరిలుగా విభజించి, వారిపై నిఘా పెట్టాలన్నారు. పోలీసు సిబ్బంది గ్రామ సందర్శనలు చేయాలని, స్థానికులతో శాంతిభద్రతల పరిస్థితులు, సమస్యలు, కొత్త వ్యక్తులు, చెడు నడత కలిగిన వారి గురించి గ్రామపెద్దలు, ప్రజలను అడిగి తెలుసుకొని, సైబరు నేరాలు, మహిళల భద్రత, రహదారి భద్రత, మాదక ద్రవ్యాల పట్ల అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్లను గుర్తించాలన్నారు. ఎం.వి. నిబంధనలు ఉల్లంఘించిన వారిపైనా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపైనా, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపైనా కేసులు నమోదు చేయాలన్నారు. అనంతరం ఇటీవల పలు కేసులను ఛేదించిన సిఐలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. సమావేశంలో డిఎస్‌పిలు ఎం.శ్రీనివాసరావు, పి. శ్రీనివాసరావు, డిఎస్‌పి వీరకుమార్, యూనివర్స్, న్యాయ సలహాదారులు వై.పరశురాం, పలువురు సిఐలు, వివిధ పోలీసు స్టేషనుల్లో ఎస్సైలు, ఆర్పైలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌పి జిందాల్

26న వెంకయ్యనాయుడు రాక

ప్రజాశక్తి-విజయనగరంకోట

మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఈనెల 26న జిల్లాలో పర్యటించనున్నట్టు కలెక్టర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలిపారు. మాజీ ఉపరాష్ట్రపతి 26న మధ్యాహ్నం 4.20 గంటలకు విశాఖ నుంచి విజయనగరం రూరల్ మండలం కోరుకొండ రోడ్డులోని రామనారాయణం వద్దకు చేరుకుంటారని వెల్లడించారు. అదేరోజు మధ్యాహ్నం 4.30 గంటలకు రామనారాయణంలో వాల్మీకి పరిశోధన కేంద్రాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. సాయంత్రం 6.40 గంటలకు కోరుకొండ సైనికస్కూల్‌కు చేరుకొని అక్కడ బస చేస్తారని తెలిపారు. 27న ఉదయం 5.45 గంటలకు విజయనగరం రైల్వేస్టేషన్‌కు చేరుకొని రైలులో భువనేశ్వర్ బయలుదేరి వెళ్లనున్నట్టు తెలిపారు.

ఆకట్టుకున్న ఎస్ఎఫ్ఐ ఫ్లాష్‌మాబ్

ప్రజాశక్తి-గజపతినగరం

డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం.. భవిష్యత్తును కాపాడుకుందాం అనే లక్ష్యంతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు శుక్రవారం నాలుగు రోడ్ల జంక్షన్‌లో ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. మత్తు పదార్థాల్ని నిర్మూలించాలనే అంశంపై అవగాహన కల్పించేందుకు ఈనెల 28, 29, 30 తేదీలలో జరగబోయే భగత్‌సింగ్ స్టూడెంట్ ఫెస్ట్‌ను జయప్రదం చేయాలని కోరుతూ ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలు కళాశాలల నుండి వచ్చిన విద్యార్థి బృందాలు పలు సినిమా పాటలకు నృత్యాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు ఎస్.సోమేష్ మాట్లాడుతూ జిల్లాలో రోజురోజుకూ పెరిగిపోతున్న మత్తు పదార్థాలను నిర్మూలించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. అందులో భాగంగా ఈనెల 28 నుంచి మూడు రోజులు పాటు గురజాడ కళాక్షేత్రంలో పెద్ద ఎత్తున భగత్ సింగ్ స్టూడెంట్ ఫెస్ట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. ఇదే సందర్భంలో స్త్రీలపై జరుగుతున్న దాడులను ఖండించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.శిరీష, నాయకులు ఈశ్వరరావు, జయ, లక్ష్మీ, స్వాతి, గౌరీ, తదితరులు పాల్గొన్నారు.




ఫ్లాష్‌మాబ్ నిర్వహిస్తున్న విద్యార్థులు

పోరాట యోధుడు ఏచూరి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మార్క్సిస్టు మేధావి, పోరాట యోధుడు సీతారాం ఏచూరి అని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి అన్నారు. శుక్రవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో సీతారాం ఏచూరి వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో కష్ట జీవుల రాజ్యం కోసం, సమ సమాజం కోసం పోరాడిన వీరుడు అని కొనియాడారు. కార్మిక కర్షక వర్గాలు కోసం,హక్కులు కోసం ప్రజా క్షేత్రంలో పోరాడటంతో పాటు చట్ట సభల్లో హక్కుల కోసం గళమెత్తిన ఉద్యమ కెరటం అన్నారు. ఆయన అందించిన స్ఫూర్తితో కార్మికులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి ఉద్యమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు మహాలక్ష్మి, గౌరీ, వెంకటలక్ష్మి, దేవి పాల్గొన్నారు.



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆశా యూనియన్ నాయకులు

సోలార్‌తో విద్యుత్ బిల్లులు ఆదా

కేంద్రమాజీ మంత్రి అశోక్

ప్రజాశక్తి- విజయనగరం కోట

సోలార్ వినియోగంతో విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోవచ్చని కేంద్ర మాజీ మంత్రి పి.అశోక్‌గజపతిరాజు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన పిఎం సూర్య ఘర్ యోజన పథకానికి సంబంధించి శుక్రవారం జొన్నవలసలో నిర్వహించిన కార్యక్రమంలో అశోక్‌గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతి రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్తు వినియోగాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. ఈ పథకంలో సోలార్ రూఫ్ టాప్స్ ఏర్పాటు చేసుకునేవారికి ప్రభుత్వం రాయితీ ఇస్తుందని తెలిపారు. గృహ వినియోగదారులు ఇంటిపై సోలార్ రూఫ్ టాప్స్ ఏర్పాటు చేసుకొని విద్యుత్ బిల్లును ఆదా చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, ఎంపిటిసి సభ్యులు రాజేష్ బాబు, వేచలపు శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు

మొక్కలు నాటిన కలెక్టర్

ప్రజాశక్తి-డెంకాడ

స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా తల్లి పేరుతో మొక్కను నాటే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పాల్గొన్నారు. శుక్రవారం డెంకాడ మండలం జొన్నాడ మండల పరిషత్ పాఠశాల ఆవరణలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అక్కడికి వచ్చిన గ్రామస్థులు కాలవ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా కలెక్టర్ స్పందిస్తూ వెంటనే చర్యలు తీసుకోవాలని డిపిఒ శ్రీధర్ రాజాకు సూచించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి, పంచాయతీ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.



క్లాప్ వాహన డ్రైవర్ల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర పాలక సంస్థలో చెత్త తరలించే క్లాప్ వాహనాల డ్రైవర్లు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉదయం క్లాప్ వెహికల్ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నల్లరిబ్బన్లు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడుతూ ఈనెల 30లోగా డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించక పోతే 30వ తేదీ తరువాత సమ్మెకు దిగుతామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎస్.రంగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పొడుగు రామకృష్ణ, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బంగారు శ్రీనివాసరావు, క్లాప్ వెహికల్ డ్రైవర్లు పాల్గొన్నారు.

జెఎన్‌టియులో మైఖేల్ ఫారడే జయంతి

విజయనగరం టౌన్ : జెఎన్‌టియు గురజాడ విజయనగరం ప్రముఖ శాస్త్రవేత్త మైఖేల్ ఫారడే జయంతిని పురస్కరించుకుని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ఇన్‌క్రెడిబుల్ లెగసీ వేడుకలను నిర్వహించింది. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రొఫెసర్ కె.కుమార్ మాట్లాడుతూ 'ఆధునిక విద్యుత్ శాస్త్రానికి ఫెరడే పని ఒక బంగారు మైలురాయి' అని అన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజేశ్వరరావు హాజరయ్యారు. అతను విద్యుదయస్కాంత ప్రేరణ, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మరియు జనరేటర్‌ల వెనుక ఉన్న సూత్రం వంటి ఆవిష్కరణల గురించి మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జిజె నాగరాజు, ఇఇఇ విభాగాధిపతి డాక్టర్ వివిస్ వకుల, కన్వీనర్ డాక్టర్ ఎ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

త్రోబాల్ పోటీలకు వల్లాపురం విద్యార్థులు ఎంపిక

గుర్ల : రాష్ట్ర స్థాయి జూనియర్ త్రోబాల్ పోటీలకు వల్లాపురం హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. శని, ఆదివారాల్లో విశాఖపట్నంలో త్రోబాల్ పోటీలు జరగనున్నాయి. బాలికల విభాగంలో పి.షమీల, బాలుర విభాగంలో ఎం.తేజ ఎంపికైనట్లు పీడీ ఎం.తిరుపతిరావు తెలిపారు. వీరిని ప్రధానోపాధ్యాయులు వి.అప్పారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

22న జనసేనలో చేరుతాం

అవనాపు విక్రమ్, భావన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 22న పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీ లో చేరుతున్నట్లు డిసిఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ అవనాపు భావన, వైసిపి మాజీ నాయకులు అవనాపు విక్రమ్, సాలూరు మాజీ మున్సిపల్ చైర్మన్ జర్జాపు ఈశ్వరరావు, కాళ్ల గౌరీ శంకర్ తెలిపారు. శుక్రవారం అవనాపు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత సార్వత్రిక ఎన్నికలు అయ్యాక వైసిపికి, పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అనుచరులతో చర్చించిన మీదట మంగళగిరిలో పవన్ సమక్షంలో జనసేన లో చేరుతున్నామని తెలిపారు. 14ఏళ్లగా వైసిపి కోసం పని చేసి పార్టీని బలోపేతం చేసినా, ఆ పార్టీ అధిష్టానం తమకు అన్యాయం చేస్తూ వచ్చిందన్నారు. ఓపికతో ఉన్నా నియోజకవర్గంలో ప్రతిపక్షంలా చూశారన్నారు. అణగదొక్కేలా వ్యవహరించారని తెలిపారు. నియోజకవర్గంలో అణచివేతలు, దోపిడి, దౌర్జన్యాలతో స్థానిక ఎమ్మెల్యే వ్యవహరించబట్టే వైసిపి దారుణ పరాజయం పాలైందన్నారు. రానున్న రోజుల్లో జనసేన జెండా రెపరెపలాడిస్తామన్నారు. సాలూరు మున్సిపల్ వైస్ చైర్మన్ జర్జాపు దీప్తితో పాటు ఏడుగురు కౌన్సిలర్లు జనసేనలో చేరుతారని తెలిపారు. జర్జాపు ఈశ్వరరావు మాట్లాడుతూ బ్రిటీష్ కాలంలో వేసిన రైల్వే లైన్ ఉన్నా సాలూరుకు ట్రైన్ వేయలేదు అన్నారు. ట్రైబుల్ యూనివర్సిటీ అసంతప్తిగా మిగిలిందన్నారు. పార్టీనీ బలోపేతం చేయడం, ప్రజలకు అభివద్ధి ఫలాలు అందించడమే లక్ష్యంగా పని చేస్తూ వచ్చామన్నారు. రైల్వేజోన్ తో విజయనగరం జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు.

ఎగుమతి ఛార్జీలు పెంచాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీ ప్రకటించిన నేపథ్యంలో సరుకు ఎగుమతి (లోడింగ్) ఛార్జీలు పెంచాలని ఎపి బెవరేజెస్ నెల్లిమర్ల డిపో హమాలీ యూనియన్ నాయకులు రెడ్డి శంకర్రావు, బి.రమణ డిమాండ్ చేశారు. ఎగుమతి ఛార్జీల రేట్లు ఒప్పందం కుదిరి రెండేళ్లు పూర్తయ్యిందని, ఇప్పటికే అనేక మార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చామని తెలిపారు. కొత్త మద్యం పాలసీ వచ్చిన నేపథ్యంలో తక్షణమే తమ ఎగుమతి రేట్లు రూ.7.25 నుండి 8రూపాయలకు పెంచాలని కోరారు. ఈ మేరకు డిఆర్ఒ అనితకు వినతి అందజేశారు. కార్యక్రమంలో పి.శ్రీను, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ సమాచార దర్శిని విడుదల

ప్రజాశక్తి-బొబ్బిలి

అంతర్జాతీయ రోటరీ సంస్థ, రోటరీ డిస్ట్రిక్ట్-3020కి సంబంధించిన రోటరీ సమాచార దర్శిని డిస్ట్రిక్ట్ గవర్నర్ జికె రావు ఆవిష్కరించారు. శుక్రవారం స్థానిక శ్రీసూర్య రెసిడెన్సీలో రోటరీ కార్యాలయంలో అధ్యక్షుడు సింహాద్రి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన రోటరీ క్లబ్ సమావేశంలో క్లబ్ డైరెక్టరీని కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ ఏడాది బొబ్బిలి, పరిసర ప్రాంత ప్రజలకు అందించాల్సిన సేవా కార్యక్రమాలపై రోటరీ క్లబ్ డైరెక్టర్లతో ఈ సందర్భంగా చర్చించారు. సమావేశంలో కార్యదర్శి ప్రవీణ్ కుమార్, డైరెక్టర్లు శ్రీహరి, సజ్జ అప్పలరాజు, కె.రామకృష్ణ, కృష్ణమోహన్, కిశోర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'ఎయిర్‌పోర్టుకు పివిజి రాజు పేరు పెట్టాలి'

ప్రజాశక్తి-బొబ్బిలి

భోగాపురం విమానాశ్రయానికి పివిజి రాజు పేరు పెట్టాలని లోక్‌సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్, సురేష్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. అల్లూరి సీతారామరాజు పేరుతో ఒక జిల్లా ఉందని తెలిపారు. మాన్సాస్ ట్రస్ట్ ఏర్పాటు చేసి వేలాది ఎకరాలు భూమి రాసిచ్చిన పివిజి రాజు పేరు విమానాశ్రయానికి పెట్టాలని కోరారు. ఎయిర్‌పోర్టుకు మద్రాస్ ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పని చేసిన రాజా రంగారావు పేరు పెట్టాలని పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు కోరారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-బొండపల్లి

కొండకిండాం గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 67లో పది మంది రైతుల నుంచి సుమారు రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు తహశీల్దార్ డి.రాజేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆక్రమిత భూముల వద్ద ఆర్ఐ సతీష్, విఆర్ఒలు హరికృష్ణ, కె.దుర్గ బోర్డులు ఏర్పాటు చేశారు.

ఇ-క్రాప్ నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి-కొత్తవలస

రైతులు తమ పంటల వివరాలను ఇ-క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఎఒ మాధురి శరణ్య తెలిపారు. మండలంలో 2014 ఎకరాల్లో వరిపంట వేశారని, 1920 ఎకరాల్లో నమోదు చేసుకున్నారని చెప్పారు. ఇ-క్రాప్ నమోదైతేనే రైతులకు రాయితీలు, పంట కొనుగోలు, నష్టపరిహారం వంటివి వర్తిస్తాయని తెలిపారు.

పాఠశాలల పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వల్లంపూడి, పికెఆర్ పురం, కెజిపూడి గ్రామాల్లోని పాఠశాలలను శుక్రవారం ఎంఇఒలు జి.జగదీశ్వరరావు, బాలభాస్కరరావు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థుల వర్క్, నోట్ పుస్తకాలను, పాఠశాలల రికార్డులను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి-వేపాడ

సోంపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఆప్తాలమిస్టు ఈశ్వరరావు కంటి పరీక్షలు చేశారు. ఆరుగురి విద్యార్థులకు కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.పి.ఎ.రాజు, ఆరోగ్య భద్రత ఇన్‌ఛార్జి ఎం.గౌరి, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఇదే పాఠశాలలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు మొక్కలు నాటారు.

ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యాన క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ మెల్లిగాక అర్జునమ్మ, గాడి గంగతల్లి, ఎంఇఒలు జి.జగదీశ్వరరావు, పి.బాల భాస్కరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కన్నయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు గుమ్మడి భారతి పాల్గొన్నారు.

ఉచితంగా మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి-వేపాడ

స్వచ్ఛత హి సేవ కార్యక్రమానికి ఉచితంగా మొక్కలు అందిస్తున్నట్లు గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు బి.రామకృష్ణ తెలిపారు. శుక్రవారం జాకేరు ప్రాథమికోన్నత పాఠశాలకు మామిడి, నేరేడు, పనస మొక్కలను అందజేశారు. మొక్కలు కావాల్సిన వారు 9391138665 నంబరును సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆర్.అప్పలస్వామి, వాసవీ క్లబ్ వనితా విభాగం ప్రాంతీయ కార్యదర్శి వి.సుశీల, కొల్లా పుష్పరాణి, బొబ్బిలి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బొంతలకోటికి సత్కారం

ప్రజాశక్తి-గజపతినగరం

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత బొంతలకోటి శంకరరావును పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సత్కరించారు. జట్టు ట్రస్ట్ వ్యవస్థాపకులు పారినాయుడు నిర్వహణలో 'మనబడి-మనతోట' ప్రకృతి గీతాలు పాటల పుస్తకం రూపకల్పనలో పాల్గొని, జానపద బాణీలతో విద్యార్థులకు అర్థమయ్యే విధంగా రచనలు చేసినందుకు గాను తోటపల్లిలోని జట్టు ట్రస్ట్ కార్యాలయంలో శంకరరావును సత్కరించారు. ఈ సందర్భంగా శంకరరావును డిప్యూటీ డిఇఒ కె.మోహనరావు, చైతన్యభారతి, లయన్స్ క్లబ్ సభ్యులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస రామారావు, తదితరులు అభినందించారు.

తుప్పలు తొలగింపు

ప్రజాశక్తి-చీపురుపల్లి

మండలంలోని అలజంగి కోళ్లఫాం నుంచి మెట్టపల్లి వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను వైసిపి జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మండల అధ్యక్షులు ఇప్పిలి అనంతం ఆధ్వర్యాన తొలగించారు. ప్రజలకు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకే తుప్పలు, పిచ్చి మొక్కలను సొంత నిధులతో తొలగిస్తున్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు చందక శ్రీనివాసరావు, రఘుమండ త్రినాథరావు, రేవళ్ల సత్యనారాయణ, మీసాల ఈశ్వరరావు, లక్ష్మణ్, రవికుమార్, రాము, ప్రభాత్, సత్యం, వెంకీ, డబ్బాడ ఆనంద్, వినోద్ పాల్గొన్నారు.

28న భగత్ సింగ్ జయంతి

ప్రజాశక్తి-బొబ్బిలి

తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీలో ఈనెల 28న భగత్ సింగ్ 117వ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు విద్యార్థి జెఎసి రాష్ట్ర కార్యదర్శి సాయికిరణ్ తెలిపారు. స్థానిక విద్వాన్, శ్రీసత్యసాయి జూనియర్ కళాశాలల్లో శుక్రవారం భగత్‌సింగ్ జయంతి వేడుకల ప్రచార పత్రాలను ఆయా కళాశాల కరస్పాండెంట్లు ఎం.వేణుగోపాలనాయుడు, చింతా అప్పారావు విడుదల చేశారు. కార్యక్రమంలో మన్యం జిల్లా అధ్యక్షులు వెంకటరమణ పట్నాయక్, బొబ్బిలి డివిజన్ అధ్యక్షులు చంద్రశేఖర్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహం సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని గిరిజన వసతి గృహంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని పిడిఎస్‌ఒ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సోమేష్, బి.రాకేష్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో డిమాండ్ చేశారు. హాస్టల్ విద్యార్థుల సమస్యలను నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సమస్యలపై జూలై 29న గ్రీవెన్సులో ఫిర్యాదు చేసినా అధికారులు పరిష్కరించలేదన్నారు. అధికారులు త్వరగా స్పందించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేసారు.

నేడు ఉపాధి హామీపై సమీక్ష


ప్రజాశక్తి-రేగిడి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఉపాధి హామీపై సమీక్ష నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ శ్యామలకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు.

సంక్షోభంలోనూ సంక్షేమం



తెర్లాం.. మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబినాయన



రాజాం.. మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

ఎమ్మెల్యేలు బేబినాయన, కోండ్రు

ప్రజాశక్తి- తెర్లాం

రాష్ట్రం సంక్షోభంలో ఉన్న ప్రజా సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం కొనసాగిస్తోందని ఎమ్మెల్యే బేబినాయన తెలిపారు. మండలంలోని ఉద్దవోలు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల్లో నాలుగింటిని వంద రోజుల్లోనే నెరవేర్చామని తెలిపారు. మరొకటి దీపావళిని నెరవేరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి టివి రామారావు, జనసేన రాష్ట్ర కార్యదర్శి పాలూరి బాబు, మండల అధ్యక్షులు మరడాన రవి, టిడిపి మండల అధ్యక్షులు వెంకట నాయుడు, ఎన్.వెంకటేశ్వర రావు, ఎంపిడిఒ ఎస్.రామకృష్ణ పాల్గొన్నారు.

బొబ్బిలి : పాతబొబ్బిలిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి, మెప్మా ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బొండపల్లి : బొండపల్లిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా హైస్కూల్లో మొక్కలు నాటారు. అనంతరం మండల ప్రత్యేకాధికారి దుర్గాప్రసాద్‌తో కలిసి ఎంపిపి చల్ల చలం నాయుడు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వైవి.రాజేంద్రప్రసాద్, వైస్ ఎంపిపి జి.ఈశ్వరరావు, ఇఒపిఆర్‌డి సుగుణాకర్ రావు, ఎంఇఒలు కె.శోభారాణి, అల్లు వెంకటరమణ, ఎఒ మల్లికార్జునరావు, ఎపిఒ కృష్ణవేణి, మాజీ జెడ్‌పిటిసి బండారు బాలాజీ, సర్పంచ్ బి.ఈశ్వరరావు, ఉపసర్పంచ్ కోల వెంకటరమణ పాల్గొన్నారు.

వేపాడ : మండలంలో జాకేరు, పాటూరు, ఆర్ఎస్‌పేట, పికెఆర్ పురం, కెజిపూడి గ్రామాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనరసింహం వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, ఇఒపిఆర్‌డి జి.ఉమ, సర్పంచులు బుద్ధ చిన్నమ్మలు, బుద్ధ అప్పలనాయుడు, కె.వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ కె.రమణమూర్తి, ఎంపిటిసిలు టి.వి.రమణ, శర్మ, జగ్గుబాబు, బంగారయ్య, ముత్యాలమ్మ పాల్గొన్నారు.



పూసపాటిరేగ.. కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బంగార్రాజు, నాయకులు

రేగిడి : మండలంలోని సంకిలిలో గ్రామసభ ఏర్పాటుచేశారు. గ్రామ సందర్శన కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ, ఆరోగ్య కేంద్రం, పాఠశాలను డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ్ చక్రవర్తి తనిఖీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బుడుమూరు పట్టాభి, ఎంపిటిసి ఎం.సంధ్య, టిడిపి నాయకులు నారు జనార్ధనరావు, గంగు కృష్ణ, కె.రమణ, ఎంపిడిఒ శ్యామల కుమారి, తహశీల్దార్ ఎల్లారావు, ఇఒపిఆర్‌డి సత్యనారాయణ, ఎపిఎం గోవిందరావు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ శ్రీచరణ్, కార్యదర్శి శైలజ, విఆర్ఒ గోపాలరావు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : సంక్షోభంలోనూ సంక్షేమం, సుపరిపాలన అందిస్తూ మంచి ప్రభుత్వంగా గుర్తింపు పొందిందనినగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య కొనియాడారు. టిడిపి వంద రోజుల పాలనలో ప్రజలకు అందిస్తున్న సంక్షేమంపై అవగాహన కల్పించేందుకు శుక్రవారం ఒకటవ డివిజన్ సాకేటి వీధిలో సమావేశం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఇది మంచి ప్రభుత్వం అని తెలియచెప్పే కరపత్రాలను అందజేశారు. సమావేశంలో టిపిఆర్ఒ సింహాచలం పాల్గొన్నారు.

పూసపాటిరేగ : సంక్షోభంలో కూడా సంక్షేమాన్ని అందించిన ప్రభుత్వం తమదని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం మండలంలో నడిపిల్లిలో జరిగింది. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఆకిరి ప్రసాద్, మండల అధ్యక్షులు మహంతి శంకర్‌రావు, కొప్పెర్ల సర్పంచ్ సత్తిబాబు పాల్గొన్నారు.

డెంకాడ : మండలంలో సింగవరం పంచాయతీలో ఎంపిపి బి.వెంకట వాసుదేవరావు ఆధ్వర్యాన గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను వివరించారు. ప్రాథమిక పాఠశాలలో మొక్కలను నాటారు. మహంతిపేట, లంకపేట పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జమదగ్ని, తహశీల్దార్ వి.పద్మావతి, ఎంపిడిఒ డిడి స్వరూప రాణి, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు పతివాడ నారాయణ, కంది సూర్యనారాయణ, ఆకిరి ప్రసాదరావు, టిడిపి మండల అధ్యక్షులు పల్లె భాస్కరరావు, సర్పంచ్ ప్రతినిధి పెట్ట అప్పారావు, నాయకులు ఊర్ల రవి, మాజీ సర్పంచ్ ఎన్నింటి శ్రీనివాసరావు, జనసేన మండల నాయకుడు పైల శంకర్రావు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : ఒమ్మిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా జనసేన పార్టీ సీనియర్ నాయకులు అంబల్ల అప్పలనాయుడు ఆధ్యరంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, పంచాయతీ కార్యదర్శి కె.వెంకటేష్ పాల్గొన్నారు.

రాజాం : మండలంలోని వి.ఆర్.అగ్రహారంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటై 100 రోజుల్లో ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గంలో నీటిపారుదల శాఖకు రూ.పది లక్షలు మంజూరు చేయడమే కాకుండా తోటపల్లి ప్రాజెక్టు ద్వారా 3 వేల ఎకరాలకు నీరందించామన్నారు. 100 రోజుల్లోనే రాజాం రోడ్లకు రూ.6 కోట్ల నిధులు తెచ్చామన్నారు.

ప్రజలు మెచ్చేలా పాలన : గురాన

విజయనగరం టౌన్ : కూటమి ప్రభుత్వ 100 రోజుల పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని జనసేన నేత గురాన అయ్యలు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మీడియా తో మాట్లాడుతూ ప్రజలు మెచ్చేలా కూటమి ప్రభుత్వ పాలన వుందన్నారు. 164 సీట్లతో అధికారంలోకి వచ్చిన ఎన్డీయే కూటమి 100 రోజుల్లో పలు హామీలు అమలు చేసిందన్నారు. ఈ వంద రోజుల్లో రాష్ట్ర ప్రజలకు ప్రజా ప్రభుత్వం మళ్లీ ఓ నమ్మకాన్ని కలిగించిందన్నారు.

కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎస్.వి.మన్మథరావు, జి.నారాయణరావు, వంగా వెంకటరావు, డి.శ్రీను, ఆర్.గణపతి, టంకాల కన్నంనాయుడు, హరి, మరిపి జగన్‌మోహన్, చింతా చంద్రినాయుడు పాల్గొన్నారు.

రామభద్రపురం : ముచ్చర్లవలసలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మండల స్పెషలాఫీసర్ గోవిందరావు ఆధ్వర్యాన నిర్వహించారు. గ్రామంలో సమస్యలను సర్పంచ్ కనిమెరక శంకరరావును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఆకుల సులోచనారాణి, ఎంపిడిఒ రమామణి, ఎంఇఒ తిరుమల ప్రసాద్, ప్రధానోపాధ్యాయులు ప్రసన్నకుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ పార్వతి పాల్గొన్నారు.



బొబ్బిలి.. కరపత్రాలను పంపిణీ చేస్తున్న కమిషనర్ రామలక్ష్మి

తూతూ మంత్రంగా గ్రామ సందర్శన

శృంగవరపుకోట : మండలంలోని వేములపల్లిలో శుక్రవారం నిర్వహించిన గ్రామ సందర్శన కార్యక్రమం తూతూ మంత్రంగా ముగిసింది. నోడల్ అధికారి మురళీకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం ఆలస్యంగా మధ్యాహ్నం 12:30 గంటలకు మొదలుపెట్టి 10 నిమిషాల్లో మమా అనిపించారు. వినతిపత్రాలు ఇవ్వడానికి వచ్చిన వారికి చూద్దాం చేద్దాం.. అంటూ కాలక్షేపం చేసి వాటిని తీసుకోకుండానే గ్రామం నుంచి జారుకున్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ అరుణకుమారి, ఎంపిడిఒ శేషుబాబు, ఇఒపిఆర్‌డి లక్ష్మి, ఎంఇఒ నర్సింగరావు పాల్గొన్నారు.



వేపాడ.. మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ

సిఎం సహాయనిధికి విరాళాల వెల్లువ



బొబ్బిలి.. ఎమ్మెల్యే బేబినాయనకు విరాళం అందజేస్తున్న ఎం.బూర్జవలస నాయకులు

ప్రజాశక్తి-బొబ్బిలి

ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు విరాళాలు ఇవ్వాలని ఎమ్మెల్యే బేబినాయన పిలుపునివ్వడంతో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఉద్యోగులు స్వచ్ఛందంగా విరాళాలు ఇస్తున్నారు. బొబ్బిలి మండలంలోని ఎం.బూర్జవలస టిడిపి నాయకులు రూ.32,200, పట్టణానికి చెందిన చేపల వ్యాపారి గోవిందరావు రూ.5వేలు, రామభద్రపురం మండలంలోని లోల్లరపాడుకు చెందిన టి.రాము, నరసయ్య రూ.10వేలు, కొత్తరేగ టిడిపి నాయకులు ఆర్.పారినాయుడు రూ.5050, ఎం.రావివలసకు చెందిన టి.నరసయ్య రూ.5వేలు, సీతానగరం మండలం గుచ్చిమి గ్రామానికి చెందిన కె.నాగభూషణరావు రూ.10వేలు, బొబ్బిలి ఐసిడిఎస్ పిఒ జె.విజయలక్ష్మి రూ.10 వేలు, బాడంగి ఐసిడిఎస్ పిఒ రాజ్యలక్ష్మి రూ.10 వేలు, బాడంగి మండలం రావివలసకు చెందిన వెంకటనాయుడు రూ.10వేలు, తెర్లాం మండలం సతివాడకు చెందిన జె.అప్పారావు రూ.10 వేలు, తెర్లాం పంచాయతీ నాయకులు రూ.లక్ష, రైస్ మిల్లర్ల అసోసియేషన్ రూ. లక్ష విరాళంగా ఎమ్మెల్యే బేబినాయనకు అందజేశారు. విరాళాలు ఇచ్చిన వారిని బేబినాయన అభినందించారు.

విజయనగరం కోట : జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులు మేము సైతం వరద బాధితుల సహాయానికి సిద్ధంగా వున్నామంటూ తమకు తోచిన సహాయాన్ని అందిస్తున్నారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం తాము సేకరించిన విరాళాల మొత్తాన్ని పలు పాఠశాలల విద్యార్థులు శుక్రవారం కలెక్టర్ అంబేద్కర్‌కు కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. గంట్యాడ మండలం లక్కిడాంకు చెందిన జెడ్‌పి హైస్కూలు భారత్ స్కౌట్స్ అండ్ గౌడ్స్ కలసి వరద బాధితుల సహాయార్థం రూ.14,091 అందజేశారు. డిఇఒ ప్రేమకుమార్, తమ పాఠశాల ప్రధానోపాధ్యాయులతో కలసి చెక్కును కలెక్టర్ కు అందించారు.

జామి మండలం విజినిగిరి జిల్లాపరిషత్ హైస్కూల్ విద్యార్థులు వరద బాధితుల సహాయార్థం సేకరించిన విరాళాల మొత్తం రూ.10,890 కలెక్టర్ కార్యాలయంలో అందించారు. డిఇఒ ప్రేమకుమార్, పాఠశాల హెచ్.ఎం. కె.వెంకటరావు, పి.వి.కృష్ణారావు తదితరులు వున్నారు.

నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి సందర్భంగా, విజయవాడ వరద బాధితుల సహాయార్థం విజయనగరం అక్కినేని ఫ్యామిలీ ఫాన్స్ తమ వంతుగా రూ.5,116 విరాళంగా అందజేశారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు శుక్రవారం అందజేశారు. జిల్లా కలెక్టర్ ను కలిసిన వారిలో జిల్లా అక్కినేని ఫ్యామిలీ ఫాన్స్ ప్రతినిధులు దుర్గాప్రసాద్, శ్రీనివాస్, దారా వెంకట్ ఉన్నారు. వీరిని కలెక్టర్ అంబేద్కర్ అభినందించారు.

తెర్లాం : తెర్లాం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు విజయవాడ వరద బాధితులకు రూ.లక్ష విరాళాన్ని ఎమ్మెల్యే బేబినాయనకు అందజేశారు. టిడిపి మండల అధ్యక్షులు వెంకటనాయుడు, నాయకులు నర్సుపల్లి వెంకటేశ్వరరావు, సర్పంచ్ రూప, ఎంపిటిసి ఆనందరావు, వైస్ సర్పంచ్ ఎం.శంకరరావు ఈ మొత్తాన్ని అందించారు



కొత్తవలస.. డిడి అందజేస్తున్న వాగ్దేవి విద్యాసంస్థల డైరెక్టర్ మహేశ్వరరావు

కొత్తవలస : వరద బాధిత సహాయార్థం వాగ్దేవి విద్యాసంస్థల డైరెక్టర్ కోటిన మహేశ్వరరావు.. రూ.2.18 లక్షల డిడిని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి అందజేశారు. ఎస్.కోటలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో డిడిని ఎమ్మెల్యేకు అందించారు.


రామభద్రపురం : విజయవాడ వరద భాధితుల సహాయార్థం ముచ్చెర్ల వలస పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి గ్రామసందర్శనకు శుక్రవారం వచ్చిన రూ.2820ను ప్రత్యేకాధికారి గోవిందరావుకు అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ సులోచనారాణి, ఎంఇఒ తిరుమలప్రసాద్, ప్రధానోపాధ్యాయులు సుందరి, సిబ్బంది ప్రసన్నకుమార్, లక్ష్మణ, రామయ్యమ్మ పాల్గొన్నారు.

మా సినిమాను ఆదరించండి

'రూ.100 కోట్లు' సినిమా నిర్మాత శ్రీనివాసరావు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మా సినిమాని ఆదరించి, ఆశీర్వదించాలని 100 కోట్లు సినిమా ప్రొడ్యూసర్ నడుపూరి శ్రీనువాసరావు అన్నారు. సినిమా విడుదల సందర్భంగా శుక్రవారం పూసపాటిరేగ సాయికృషా థియేటర్ వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడారు. రూ.5కోట్లు వ్యయంతో మానిటైజేషన్‌లో ప్రజలు పడ్డ ఇబ్బందులును తెరపై చూపించాలన్న ఉద్దేశంతో 100కోట్లు టైటిల్‌తో సినిమా తీసామన్నారు. ఈ రోజున తెలుగు రాష్ట్రాల్లో 200 థియేటర్లలో విడుదలయ్యిందన్నారు. మంచి సబ్జెక్ట్ ఉన్న సినిమా తీసారని అందరూ మమ్మల్ని కొనియాడుతున్నారన్నారు. వైసిపి జిల్లా నాయకులు పిన్నింటి వెంకటరమణ మాట్లాడుతూ మన ప్రాంతం నుండి వెళ్లి సినిమా తీయడం చాలా సంతోషంగా ఉందని, చిన్న సినిమాలను ప్రేక్షలు ప్రొత్సహించా లన్నారు. ఆయనతోపాటు వెంపడాం సర్పంచి పిన్నింటి కుమార్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న నిర్మాత శ్రీనివాసరావు

సినిమాపై ఆసక్తితో తీశాం

'మాది విజయనగరం జిల్లా భోగాపురం మండలంలోని చాకివలస గ్రామం. చిన్నప్పటి నుండి మెగాస్టార్ చిరంజీవి, పవన్ కళ్యాణ్ అబిమానులం. చిరంజీవి స్ఫూర్తితో సినిమాలోకి వెళ్లాలని ఆలోచన ఉండేది. కానీ మాకు ఆ వయసులు దాటిపోయాయి. దాంతో సినిమా నిర్మాతగానైనా ఉండాలన్న ఆలోచనతో ఈ సినిమా తీసాను. నిర్మాతగా మారి మాతో పాటు పది మందికి ఉపాది కల్పించిన వారం అవుతామని ఆలోచన వచ్చింది. అందుకే పల్లెటూరు నుంచి వెళ్లి సినిమా నిర్మాతగా ఉన్నాం' అని శ్రీనివాసరావు తెలిపారు.

ఫ్రైడే డ్రైడే తప్పనిసరి

ప్రజాశక్తి-పూసపాటిరేగ

ఫ్రైడే డ్రైడేని ప్రజలంతా పాటించాలని డిఎంహెచ్ఒ ఎం.భాస్కరరావు సూచించారు. శుక్రవారం మండలంలోని చోడమ్మ అగ్రహారంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వీధుల్లో పారిశుధ్యం, నీటి నిల్వలను పరిశీలించి ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రతీ ఇంటి ముందు నీటినిల్వ చేస్తున్న ప్లాస్టిక్ డ్రమ్ముల్లో దోమ లార్వా ఎక్కడా కనిపించకపోవడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో ఉన్న మహిళలకు సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఎప్పటికప్పుడు నీటి నిల్వలు లేకుండా చూసుకుంటున్నామని మహిళలు డిఎంహెచ్ఒకు తెలిపారు. ప్రజల్లో ఈ విధమైన అవగాహన అవసరమని, ఇలా పాటిస్తే వ్యాధులు రాకుండా ఆరోగ్యవంతమైన గ్రామాలు నిర్మించవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి సత్తిరాజు, హెల్త్ ఎడ్యుకేటర్ అనిల్ ప్రేమ్ కుమార్, పంచాయతీ సెక్రటరీ జ్యోతి, పిహెచ్‌సి సిబ్బంది ఆర్.వి.రమణ, ఎఎన్ఎం లక్ష్మి, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ సింధుజ, ఆశాలు సుబ్బలక్ష్మి, గౌరి పాల్గొన్నారు.

వరిసాగులో నూతన విధానం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-రేగిడి

మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని పంటసాగు విధానాన్ని అలవర్చుకోవాలని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. చాటాయివలసలో రైతు సేవా కేంద్రం వద్ద వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులకు యంత్ర సహాయంతో ఎదసాగు విధానంపై అవగాహన కల్పించారు. ఈ విధానం ద్వారా రైతులకు పెట్టుబడితో పాటు సమయం, నీటి వినియోగం తగ్గించుకోవచ్చునని తెలిపారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించి, బయో ఎరువులను వాడాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ ఏరియా మేనేజర్ దేవుడుబాబు, ఎఒ మురళీకృష్ణ, మండల సమన్వయకర్త టంకాల శరత్‌బాబు, ఎంపిటిసి గోవిందరావు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-బొబ్బిలి

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఐసిడిఎస్ సిడిపిఒ జె.విజయలక్ష్మి తెలిపారు. పట్టణంలోని ఏడో వార్డు గొనావారివీధిలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. అంగన్వాడీలు తయారు చేసిన పౌష్టికాహారాన్ని ప్రదర్శించారు. గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని అంగన్వాడీలకు సూచించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ అరుణ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

కొత్తవలస : బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించం మనందరి బాధ్యతని మండల ప్రత్యేకాధికారి బోని రామానంద్ తెలిపారు. సంతపాలెంలో నిర్వహించిన పౌష్టికాహార అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వై.పద్మజ, తహశీల్దార్ పి.నీలకంఠరావు, అంగన్వాడీ సూపర్వైజర్ స్వర్ణలత, ఎంఇఒ జి.శ్రీదేవి, సర్పంచ్ బొడ్డు దేవి, ఎంపిటిసి ఎస్.వెంకటరమణ, అంగన్వాడీలు మానస, కృష్ణవేణి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

వేపాడ : జాకేరులో అంగన్వాడీ కేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ సందర్శించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు జి.కామేశ్వరి, బి.భాగ్యవతి, అంగన్వాడీ కార్యకర్త జి.కిరణ్ కుమారి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ప్రజాశక్తి-రామభద్రపురం

మండల పరిధిలోని ఏడొంపుల గెడ్డ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. పాతరేగ గ్రామానికి చెందిన గొర్లి భాస్కరరావు ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్న ఇసుకను పాడివానివలస జంక్షన్ వద్ద పట్టుకున్నట్లు చెప్పారు.

పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి-గుర్ల

మండలంలో కోటగండ్రేడు గ్రామంలో మరడాన సూర్యనారాయణ పూరిల్లు శుక్రవారం తెల్లవారుజామున దగ్ధమైంది. ఒక్కసారిగా పొగలు కమ్ముకోవడంతో నిద్రిస్తున్న సూర్యనారాయణ కుటుంబమంతా భయంతో బయటకు రావడంతో పెనుప్రమాదం తప్పింది. రూ.10 వేలు నగదు, ఆధార్, రేషన్‌కార్డులు కాలిపోయాయని బాధితులు తెలిపారు. విఆర్ఒ, పంచాయతీ కార్యదర్శి నష్టాన్ని అంచనా వేశారు.